క్లుప్తంగా

ప్రథమ చికిత్సతో ప్రాణాపాయం తప్పించవచ్చు



ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి

విజయనగరం ఫోర్ట్: ఆపదలో ఉన్న వ్యక్తికి ప్రథమ చికిత్స చేయడం ద్వారా ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చునని రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యుడు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాము కరిచినప్పుడు, అగ్ని ప్రమాదాల్లో గాయపడినప్పుడు, గుండెపోటు వచ్చినప్పుడు, రోడ్డు ప్రమాదంలో గాయపడినప్పుడు చేయాల్సిన ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సత్యం, గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాలక్ష్మికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో ఉన్న శ్రీక్షేత్రమ్‌లో అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో కొలువైన విద్యాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రమేష్ ఆచార్యులు, శ్రీనివాస్ రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి స్నపనం, పంచామృతాభిషేకాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం చేపడుతున్న వేదపండితులు

విజయనగరం టౌన్: నగరంలోని బొండాడవీధిలో కొలువైన మహాగణపతి, కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి దేవాలయం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా శివపార్వతుల కల్యాణం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువజామునుంచి స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ఆలయ అర్చకులు అండలూరి గంగధరఆచారి, కాకినాడ వెంకటరమణ, లక్కోజు ఓంకారాచారి, పేరుమళ్ల మణికంఠశాస్త్రి శిష్యబృందం వేడుకలను చేపట్టారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన 108 చీరలతో ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సోమరాజు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ

జామి: నవధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువులతో రైతులకు అధిక ప్రయోజనాలు కలుగుతాయని వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలో శిరికిపాలెం గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయం విభాగం ఆధ్వర్యంలో తయారుచేసిన నవధాన్యాలు కిట్లను ఏఎంసీ మాజీ చైర్మన్ గుడివాడ రాజేశ్వరరావుతో కలిసి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ 32 రకాల విత్తనాలతో ఈ కిట్లు తయారు చేశామని, మండలంలో అన్ని రైతుభరోసా కేంద్రాల్లో విత్తన కిట్లు అందుబాటులో ఉంచామన్నారు. కావాల్సిన రైతులు ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలని కోరారు. తొలకరి వర్షాలకు ముందు నవధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువులు సాగుచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది సరోజిని, పద్మ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా రోడ్లు





విజయనగరం జిల్లా కేంద్రంలో భానుడి ప్రతాపానికి రోడ్డుపై తిరగడానికి ప్రజానీకం భయపడుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతతో పాటు ఉక్కపోతతో సతమతమవుతున్నారు. అప్రకటిత కర్ఫ్యూను తలపిస్తున్న రోడ్లు కెమెరా కంటికి చిక్కాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

దశాబ్దాల కల సాకారమయ్యే వేళ..



కేఎల్‌పురం ప్రాంతంలో తుది దశకు చేరుకున్న వాటర్ ట్యాంక్

- 45వ డివిజన్‌లో తీరనున్న తాగునీటి సమస్య
- రూ.1.60 లక్షలతో ట్యాంక్ నిర్మాణం
- రూ.98 లక్షలతో పైప్‌లైన్ల ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం

విజయనగరం:

నగర శివారు ప్రాంతం... కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న కేఎల్ పురం వాసుల దశాబ్దాల కల సాకరమయ్యే సమయం ఆసన్నమవుతోంది. విజయనగరం కార్పొరేషన్‌లోని 45వ డివిజన్ పరిధిలో గల ఈ ప్రాంతం దశాబ్దాల కిందట ఏర్పడినప్పటి నుంచి తాగునీటి ఇబ్బందులున్నాయి. గత పాలకులు ఓట్లు దండుకుని కల్లబొల్లి మాటలతో కాలం వెల్లదీయగా... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఇచ్చిన హామీ మేరకు సమస్య పరిష్కారానికి చర్యలు వేగవంతమయ్యాయి. ఇందులో భాగంగా గతేడాది డివిజన్ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.60 కోట్లతో 500 కేఎల్ సామర్థ్యంతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభించగా... ప్రస్తుతం ఆ పనులు తుది దశకు చేరుకున్నాయి. అంతేకాకుండా ట్యాంక్ నుంచి డివిజన్ పరిధిలో ఉన్న కాలనీలు, వీధులకు నీటి సరఫరా చేసేందుకు అవసరమయ్యే పైప్‌లైన్ల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. డివిజన్ పరిధిలో కేఎల్‌పురం, మొండి వీధి, బ్యాంక్ కాలనీ, రెవెన్యూ కాలనీ, నల్లమారమ్మ కాలనీ, రాజుల కాలనీ, సాయి లలితనగర్-1, సాయి లలితనగర్-2, ఎస్సీ, ఎస్టీ కాలనీలతో పాటు పలు కాలనీలను కలుపుతూ రూ.98 లక్షలతో పైప్‌లైన్లు ఏర్పాటు చేసేందుకు కార్పొరేషన్ కౌన్సిల్ ఆమోదించి నిధులు మంజూరు చేసింది. 3 నుంచి 6 నెలల్లో పైప్‌లైన్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తికానున్నట్లు అధికారులు చెబుతున్నారు. అదేక్రమంలో ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తి కానుండడంతో కేఎల్‌పురం వాసులు తమకు తాగునీటి కష్టాలు తీరనున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం ఇదీ పరిస్థితి..

కేఎల్ పురం ప్రాంతంలో చిన్నా, పెద్దా కలుపుకుని పదికి పైగానే కాలనీలు ఉన్నాయి. వాటి పరిధిలో 1450 నివాస భవనాలు ఉండగా.... సుమారు 5000 వరకు జనాభా నివసిస్తున్నారు. దశాబ్దాల కిందట ఏర్పడిన కాలనీకి తాగునీటి సుదపాయం లేకపోవడంతో స్థానికులంతా ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు ప్రతిరోజూ స్థానికులు అవసరమయ్యే నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. సమస్యపై స్పందించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి 2019 ఎన్నిలకు ముందు ఇచ్చిన హామీ మేరకు తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 500 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్‌ను నిర్మించడంతో పాటు కాలనీల్లో కుళాయిలు ఏర్పాటుకు అవసరమైన పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారు.

త్వరలోనే మోక్షం..



కేఎల్ పురం ప్రాంత వాసుల తాగునీటి సమస్యకు త్వరలోనే మోక్షం కలగనుంది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఇచ్చిన హామీ మేరకు కాలనీలో రూ.1.60 లక్షలతో వాటర్ ట్యాంక్‌తో పాటు రూ.98 లక్షలతో పైప్‌లైన్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. మరో మూడు నెలల్లో పనులు పూర్తి చేసి ఇక్కడి ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తాం.

– తాళ్లపూడి సంతోషికుమారి, కార్పొరేటర్

పేదల జీవితాల్లో వెలుగులు



భోగాపురం: రావాడలో లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- పేదలందరికీ ఇళ్లు, స్థలాల కేటాయింపు
- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవానికి స్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మించి వారి నివాసాల్లో దీపాలు వెలిగిస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రావాడలో రెండోరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పలనాయుడు, తదితరులు ఇంటింటికీ తిరిగి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలను వివరించారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు పాలన చూసిన ప్రజలు విసిగి వేసారి 23 సీట్లు ఇచ్చి ఆయన రాజకీయ జీవితానికి సమాధి కట్టి సరైన బుద్ధి చెప్పారన్నారు. అయినా చంద్రబాబుకు బుద్ధి రాలేదని, ఇప్పటికీ బుద్ధిలేని మటలే మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడిడ పేదల సొంతింటి కలను నేరవేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతుంటే సహించలేని చంద్రబాబు ఆ నివాసాలను శ్మశానాలతో పోల్చడం దుర్మార్గమన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో జగనన్న కాలనీల్లో ప్రజలు సంతోషంగా నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారని చెప్పారు. చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలే మళ్లీ సరైన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు, సర్పంచ్ అప్పురభుక్త పైడినాయుడు, పడాల భాను, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, బైరెడ్డి ప్రభాకరరెడ్డి, డి.వాసుదేవ వర్మ, కొల్లు రామ్మూర్తి, ఎం.నరసింహులు, దేముడుబాబు, కర్రోతు శ్రీనివాసరావు, పూడిక నూకరాజు, తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

భోగాపురం: మండలంలోని రావాడ గ్రామంలో సుమారు రూ.8 లక్షల ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, పంచాయతీ నిధులతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీ చిన్నారులతో కలిసి ఆయన కాసేపు సరదాగా గడిపారు. ఏసీడీపీఓ తవిటినాయుడు, సూపర్‌వైజర్ శాంతిలత, అంగన్‌వాడీ కార్యకర్తలు అందరూ కలిసి ఎమ్మెల్యే అప్పలనాయుడును సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు, పడాల భాను, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, వాసుదేవవర్మ, బైరెడ్డి ప్రభాకరరెడ్డి, కొల్లు రామ్మూర్తి, సూర్యనారాయణ, దేముడుబాబు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథరెడ్డి చిరస్మరణీయుడు



మాట్లాడుతున్న అరసం జిల్లా ప్రతినిధి బాలు

విజయనగరం టౌన్: కేతు విశ్వనాథరెడ్డి చిరస్మరణీయుడని అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధి బాలు అన్నారు. ప్రముఖ రచయిత, విద్యావేత్త, రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం పూర్వ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి సంస్మరణ సభ స్థానిక గురజాడ స్వగృహంలో శుక్రవారం రాత్రి నిర్వహించారు. ముందుగా విశ్వనాథరెడ్డికి రచయితలు నివాళులర్పించారు. కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జీఎస్.చలం, ప్రముఖ రచయిత్రి చివుకుల శ్రీలక్ష్మి, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం



మెప్మా మార్కెట్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: పట్టణంలోని మొయిద జంక్షన్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అర్బన్ మార్కెట్‌ను నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని శుక్రవారం ప్రారంభించారు. మహిళలు స్వయంగా రూపొందించిన ఉత్పత్తులను చైర్‌పర్సన్‌తో కలిసి కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన మహిళలు సొంతంగా తయారుచేసిన ఉత్పత్తులతో మార్కెట్ ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ స్వయం సమృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం డి. గోవిందరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, టీఎల్‌ఎఫ్ ప్రెసిడెంట్ కనకల హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ డే ఆఫ్ ప్రేయర్‌కు సర్వం సిద్ధం



గ్లోబల్ డే ఆఫ్ ప్రేయర్ ప్రార్థనా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పాస్టర్లు

విజయనగరం టౌన్: ప్రపంచ ప్రార్థనా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో ఉన్న దైవసేవకులు, సంఘాల పాస్టర్లతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు దైవసేవకుడు రెవరెండ్ యబ్బోజు చౌదరి తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రేస్ గాస్పల్ చర్చిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 28వ తేదీ సాయంత్రం 6గంటల నుంచి 9 వరకు కంటోన్మెంట్ సీఎస్‌ఐ సెయింట్ మేరీస్ చర్చి గ్రౌండ్స్ ఆవరణలో క్రైస్తవ సమాజ శ్రేయస్సు, ఐకమత్యం పెంపొందించేందుకు, ప్రపంచ శాంతి, దేశ క్షేమానికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. ప్రార్థనల్లో పాస్టర్లు, భక్తులు, క్రీస్తు ఆరాధకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవరెండ్ పాల్సన్, వివేక్, స్టీవెన్ పాల్సన్, ప్రేమానందం, జాన్ మోజెస్, సునీల్, మధు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి ఐరిస్ ఆధారిత రేషన్

గజపతినగరం: వేలిముద్రలు పడని రేషన్ లబ్ధిదారులకు వచ్చే నెల 1 నుంచి ఐరిస్ ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ఎం.అరుణకుమారి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ, గంట్యాడ మండలాల ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. బయోమెట్రిక్ నమోదు సమయంలో వేలిముద్రలు పడనివారికి ఐరిస్ నమోదు చేసి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. అందుకు అవసరమైన ఐరిస్ మెషిన్లను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. గజపతినగరం మడలానికి 11, బొండపల్లి 10, మెంటాడ 9, దత్తిరాజేరు 11, గంట్యాడ 13 చొప్పున ఐరిస్ మెషీన్లు వచ్చాయన్నారు. సమావేశంలో పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్ ఉన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేత

గుర్ల: మండలంలోని తాతావారి కిట్టాలి అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు శుక్రవారం సందర్శించారు. చిన్నారులకు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారంపై సీడీపీఓ ఆరుద్ర ను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తకు ఆదేశించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ బెల్లాన మంగమ్మ, బెల్లాన రామునా యుడు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి



మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఏపీజీఈఏ సంఘ సభ్యులు

భోగాపురం: ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని ఏపీజీఈఏ సంఘ జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు కోరారు. రాష్ట్ర ఏపీజీఈఏ సంఘం పిలుపు మేరకు మండల కేంద్రంలో భోగాపురం సంఘం తాలుకా అధ్యక్షుడు జగ్గపు ఉమామహేష్ అధ్వర్యంలో శుక్రవారం రిలే నిరాహార దీక్షా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేయడంతో పాటు డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. అక్టోబర్ 31వ తేదీలోపు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, లేనిఎడల నవంబర్ 1వ తేదీ తర్వాత ఏక్షణమైనా సమ్మెకు వెళ్లక తప్పదన్నారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ సంఘ రాష్ట్ర కార్యదర్శులు ఎం.తిరుపతి, ఎల్‌వీ.యుగంధర్, సంఘ సభ్యులు పి.రమణ, బంగార్రాజు, రోహణ్‌కుమార్, బాలాజీ శ్రీకాంత్, పెన్ననర్సు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసై జీవితాలు పాడుచేసుకోవద్దు

చీపురుపల్లి: యువత మద్యం, గంజాయి, సిగరెట్, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. ఎస్ఈబీ ఏఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో శుక్రవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. మత్తు పదార్థాలు విడనాడండి–విలువైన జీవితాలు కాపాడుకోండి అంటూ నినాదాలు చేశారు. మత్తు పదార్థాల వినియో గం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

సేవలకు గుర్తింపు

- ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు
- వాడవాడలా వలంటీర్లకు సత్కారాలు



డెంకాడ: సన్మానం పొందిన వలంటీర్లతో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, తదితరులు

డెంకాడ: ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పేరుతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తగిన విధంగా గౌరవిస్తోందని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండలంలోని అక్కివరంలో అక్కివరం, బంటుపల్లి, గంట్లాం, బంగార్రాజుపేట, తదితర గ్రామాలకు చెందిన వలంటీర్లకు ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు సన్మానించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్‌లు కంది కిరణ్ కుమార్, బాలి సత్యనారాయణ, ఈఓపీఆర్‌డీ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిక్కాల జనార్ధనరావు, సాడి ఈశ్వరరావు, రమణరాజు, పలువురు అధికారులు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఘన సత్కారం

నెల్లిమర్ల: నగరపంచాయతీ మొయిద జంక్షన్, గాంధీనగర్ కాలనీ వార్డు సచివాలయాల పరిధిలోని వార్డు వలంటీర్లను ఘనంగా సత్కరించారు. పట్టణవాసులకు అంకితభావంతో సేవలందించిన వలంటీర్లకు నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైఎస్సార్‌సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు సేవామిత్ర, సేవారత్న బిరుదులతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జానా ప్రసాద్, కౌన్సిలర్ జానా సంధ్యారాణి, జేసీఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, ఆర్ఐ త్రినాథ్ పాల్గొన్నారు.

దేశానికే రోల్‌మోడల్ ..

పూసపాటిరేగ: మన రాష్ట్రంలో అమలవుతున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. పేరాపురం, వెంపడాం, గుంపాం గ్రామాల సచివాలయాల్లో వలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సచివాలయాల ద్వారా వలంటీర్లు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.రామారావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసురావు, రౌతు శ్రీరామ్మూర్తి, పిన్నింటి కుమార్, కోట్ల రఘు, ఎడ్ల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: గాంధీనగర్ కాలనీలో సత్కారం అందుకున్న వలంటీర్లు



నెల్లిమర్ల: మొయిద జంక్షన్ సచివాలయంలో వలంటీర్లను సత్కరించిన ప్రజాప్రతినిధులు



పూసపాటిరేగ: పేరాపురంలో సన్మానం అందుకున్న వలంటీర్లతో ఎంపీపీ కల్యాణి, తదితరులు